...వేలు యిస్తామన్నాడు. కాని... చూడండి ఆ అమ్మాయి అంత తెలుపుకాదు" జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి సిగరెట్ వెలిగించాడు శంకర్రావుగారు.

"ఏదో లెండి. మా అమ్మాయిని నేను పొగడకూడదు కాని... నా రంగులో ఉంటుంది" మందహాసంతో ఎదుటాయన అన్నదానికి పగలపడి నవ్వాడు శంకర్రావుగారు, "బలే జోక్ వేశారే" అన్నట్లు. నిజానికి ఆయన చాలా తెల్లగా ఉన్నాడు.

"శంకర్రావుగారూ!" ఆరంభించాడు ఎదుటాయన. "నా పేరు రాజశేఖరం. మా అమ్మాయిని మీవాడికి చూపి నచ్చితే మీతో వియ్యం పొందాలనివుంది. ఎందుకంటే మీరు నాకెంతో నచ్చారు."

ఇక శంకర్రావుగారు విజృంభించారు. తన స్థిరచరాస్తుల వివరాలూ, సంపాదించినడబ్బూ (బ్లాక్-వైట్) అన్నీ పూసగుచ్చి మెడలో వేసినంత పొందిగ్గా చెప్పాడు. ఎందుకంటే వివాహ విషయాల్లో ఎదుటివారికి అధికులుగా కనబడాలి.

అంతా చెప్పేసి "మీకు స్వంత యిల్లు వుందా?" అన్నాడాయన. అది లేకపోతే తనతో మాట్లాడడానికే అనర్హుడు అన్నట్లు.

ఎదుటి పెద్దమనిషి దెబ్బతిన్నట్లున్నాడు, "క్షమించండి. అవేమీ నాకు లేవు. కాని మా అమ్మాయి మాత్రం బుద్ధిమంతురాలు."

"ఎవరు కాదండీ. ఈ రోజుల్లో ఆస్తిలేనిదే ఏంచేయగలరు చెప్పండి? ఈ కాస్ట్లీ సొసైటీలో జీవితమే దుర్భరం."

ఇంకా ఆయన ఉపన్యాసం అలా కొనసాగును కానీ యింతలో సినిమాలోలా ఒక వింత జరిగింది.

"శంకర్రావుగారూ! మీరు ఇన్‌కంటాక్స్ ఎంత కడుతున్నారు" రాజశేఖరంగారి పక్కనే ఉన్న జమా జెట్టి లాటి మనిషి ప్రశ్నించాడు.

శంకర్రావుగారు తెల్లబోయారు ఒక్క క్షణం. కాని వెంటనే తేరుకొని "డిటీజ్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్" అన్నారు కోపంగా.

"కాదు. అవసరమే" రాజశేఖరంగారు మందహాసంతో అన్నారు.

"క్షమించండి. మా అమ్మాయికి ఆరు సంవత్సరాల క్రితమే పెళ్ళయింది. ప్రస్తుతం నేను గవర్నమెంట్ తరఫున ఇన్‌కమ్‌టాక్స్ ఎగొడుతున్న వారిని పట్టుడానికి బయలుదేరాను. ఈ రోజుకి మీరు మొదటివారు. మీమీద అనధికారంగా వచ్చిన రిపోర్టుల ననుసరించే ఇలా ప్లాన్ వేయాల్సి వచ్చింది. అందుకు మరచాను. మీ సంభాషణ అంతా రికార్డయిందని మాత్రం మరవకండి."

నా ఆశ్చర్యానికి మేరలేదు. వివాహాలు ఎలా కుదుర్తాయో చూడకపోయినా నేరస్థుల్ని పరిశోధకులు ఎలా పట్టుకొంటారో చూడగలిగాను. ఇంతకూ పాపం వివాహం కుదిరింది శంకర్రావుగారి అబ్బాయికి కాదు, ఆయనకే!

***



# 'దొంగ... దొంగ... పట్టుకోండి!'

ఒగర్చుకుంటూ అప్పుడే బయలుదేరుతున్న "హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్"లో ఎక్కాడు రాములు. గుండె ఇంకా దడదడమని కొట్టుకుంటూనే వున్నది. "దొంగ... దొంగ పట్టుకోండి!" అన్న కేకలు యింకా చెవిలో మార్మోగిపోతున్నాయి. తను తప్పేం చేశాడు? నలుగురి దృష్టిలో "దొంగ" అయినాడు. కొన్ని గంటలముందు జరిగిన సంఘటనలు గుర్తుకు రాసాగాయి.

రాత్రి తొమ్మిదవుతుంది. ఇంకా సినిమా వదిలి పెట్టలేదు. రిక్షా రోడ్డు ప్రక్కకు తోసి, రోడ్డు మీద నిలబడ్డాడు రాములు.

"ఏయ్ రిక్షా! మూర్తిమహల్ కొస్తావా?" అడిగాడు ఒక పెద్దమనిషి.

"ఎక్కండి బాబూ!" అన్నాడు రాములు.

మూర్తినుహల్ దగ్గర దిగి, "మళ్ళీ యిప్పుడే వస్తాను" అంటూ బాడుగ ఇవ్వకుండా లోనికి వెళ్ళాడతను.

"సెంటర్‌కు పోనీయవోయ్!"

వెనక్కి తిరిగి చూశాడు రాములు. రిక్షాలో ఎవరో కూర్చుని వున్నారు.

"రానండీ... బాడుగ వుంది" అన్నాడు రాములు. రిక్షాలో కూర్చున్నతను దిగి, వెళ్ళిపోసాగాడు. అతను దిగుతుంటే ఏదో కాగితం సీటు మీద నుంచి క్రింద పడటం చూశాడు రాములు.

వందరూపాయల నోటు!

రాములు మనస్సులో అనేకమయిన ఆలోచనలు పరుగులెత్తినాయి. చివరకు అతనిలోని న్యాయబుద్ధే గెలిచింది.

"ఏమండోయ్!"

వెళ్ళుతున్నతను వెనక్కి తిరిగి చూశాడు.

"ఇదిగోనండి, మీ డబ్బు రిక్షాలో పారేసుకున్నారు."

అతను అయోమయంగా చుట్టూ చూశాడు.

రెండవ బహుమతి రు. 25

అలపర్తి రామకృష్ణ
బి. ఏ. (మొదటి సం॥)
వి. బి. ఎన్. కాలేజి,
నిడుబ్రోలు, గుంటూరు జిల్లా.

రాములు చేతిలో ఒక పది రూపాయల నోటువుంచి, ఆ వంద రూపాయలుతీసుకొనివడివడిగాఅడుగులు వేసుకొంటూ వెళ్ళిపోయాడు.

రాములు పది రూపాయల నోటును ఆనందంగా జేబులో పెట్టుకున్నాడు.

సినిమా వదిలిపెట్టారు.

రాములు రిక్షాదగ్గరకు వచ్చాడు అంతకుముందు ఎక్కినాయన రిక్షా దగ్గర నిల్చుని, రిక్షా పరీక్షిస్తున్నాడు. రాములు ఆయన దగ్గరకెళ్ళాడు.

"ఒరేయ్, నా వందరూపాయలు పోయినాయి, నీవేమన్నా తీశావా?" అంటూ రాములు జేబులో చెయ్యి పెట్టాడు. పది రూపాయల నోటు తగిలింది చేతికి. రిక్షావాడి మీద అనుమానం వచ్చింది ఆయనకు. పెద్దగా కేకలు వెయ్యటం మొదలు పెట్టాడు.

"ఒరేయ్ నువ్వే కాజేశావ్ ... మిగతా డబ్బులేవి? ... చెప్పు."

రాములుకు భయం పుట్టింది. ఆయన్ని విదుల్చుకొని అక్కడ్నుంచి పరుగెత్తాడు

"దొంగ ... దొంగ ...పట్టుకోండి!" అంటూ వెంటబడ్డాడు పెద్దమనిషి.

జరుగుతున్న సంఘటనను చూస్తూ "అద్దెరిక్షా" మౌనంగా నిలబడిపోయింది.

***






# పరివర్తన

## బాలగంగాధర తిలక్

థియేటర్ అంతా జనంతో నిండి ఉంది. పావుగంట ఆలస్యంగా మిలిటరీ దుస్తులలో వచ్చిన శంకరానికి బ్యాటరీలైటువేసి చూపిస్తున్నా సరే, సీటు వెతుక్కోడం కష్టమయింది. తడబడుతూ, కాళ్ళు తొక్కుకుంటూ చివరికి సీటులో చతికలపడ్డాడు. ప్రేక్షకులందరూ ఏకాగ్రతతో తెరమీద కథలో నిమగ్నులై ఉన్నారు. బరువుగా విడుస్తున్న వాళ్ళ ఊపిరి చప్పుడు శంకరానికి వింతగా తోచింది. తెరమీద మంచు దట్టంగా కప్పిన పట్టణంలో ఒక భాగం. ఓవర్‌కోట్స్ వేసుకున్న వ్యక్తులు రోడ్డు మీద మంచులో స్పష్టాస్పష్టంగా గోచరిస్తూ నడుస్తున్నారు. ఒక చర్చి కిటికీలోంచి ముసలివాడు నిర్లిప్తంగా మంచుని మనుష్యుల్ని పరికిస్తున్నాడు. హఠాత్తుగా పిస్తోలు పేలిన చప్పుడు రోడ్డుమీద ఓవ్యక్తి "అబ్బా" అంటూ ఒరిగాడు బూట్ కాళ్ళు కలదొక్కుగుంటూన్న చప్పుడు ... శంకరం చేతిమీద ఎవరిదో మెత్తని చేయిపడింది. శంకరం పక్కకి చూశాడు. ఒక యువతి చప్పున చేయి తీసేసుకుని "సారీ" అని తెరవైపు చూస్తూవుంది.

హిచ్‌కాక్ పిక్చర్ యొక్క ప్రభావం అనుకున్నాడు శంకరం ఆమె కలవరపాటు మాసి. అతనికి కథ అర్థం కావడం లేదు, ఆలస్యంగా రావడం మూలాన. అయినా శ్రద్ధగా తెరమీదకి చూస్తున్న అతనికి తన ప్రక్కనున్న యువతి తనవైపే చూస్తున్నట్టు అనిపించింది. నిశితంగా వెచ్చగా తనకి ఆ చూపులు తగులుతూన్నట్టు ఉంది శంకరానికి. ఆమెవైపు చూడాలనుకుని కూడా అతను కుతూహలాన్ని అణచుకున్నాడు. ఇంతలో ఆ యువతి ఏడుపును నొక్కిపట్టిన సన్నని ధ్వని – ఆగి ఆగి అతనికి వినపడింది. వింతగా ఆమెవైపు చూశాడు. పరీక్షగా, నిదానంగా చూశాడు. రాజేశ్వరి! శంకరం వొళ్ళూ మనస్సూ ఒక్కసారిగా వేడిగా కంగారుగా అస్తిమితంగా అయిపోయింది. కొంతసేపటికి తమాయించుకొన్నాడు. ఆమె చేతిమీద చెయ్యివేసి "రాజీ" అన్నాడు మెల్లగా.

"బాగున్నావా" అంది రాజేశ్వరి నిట్టూర్పుని, మాటల్ని నొక్కిపట్టి. శంకరం చేతినుండి ఆమె తన చేతిని మెల్లగా తీసేసుకుంది. ఇద్దరూ